



ఎదతెరిపి లేకుండా ఫెట ఫెటమని తప్పెటలు మ్రోగుతున్నాయి. ఉండి ఉండి ధాం, ధాం మని అవుట్లు పేలు తున్నాయి ఆ శబ్దమేమిటో తెలుసుకోవాలనే ఉత్సుకత తొంగి చూసింది నిరంజనం మనసులో.

కావి అతను మంచంమీదనుండి లేవ లేదు. లేవలేడు కూడా. ఎవరిదైనా అంతిమ ప్రయాణమేమో ననుకున్నాడు. అనుకుని నవ్వుకున్నాడు పుట్టిన ప్రాణి పోవటం ఎంత సహజం! కాని సహజమైన గావును తప్పించుకోవాలనే తపన, ఇంకా ఏదో సాధిద్దామనే ఆరాటం మనిషిని వదిలిపోవెందుకనో!

ఇదేమిటి, తనకీనాడు ఇలాంటి ఆలోచనలు వస్తున్నాయి! విన్న మొన్నటివరకు తన ఆలోచనలు ఎలా ఉండేవి! తన ఆలోచనలలో ఈ మార్పు ఎందుకు వచ్చింది!

గట్టిగా తలుపు తట్టిన చప్పుడు

నిరంజనం విన్నాడు. కాని లేవలేడు. శరీరంలోని అణువణువూ పుండులా సలుపుతోంది.

మళ్ళీ తలుపు చప్పుడు....

"ఎవరో! నేను తలుపు తీయలేను. ఎడమచేతివైపు సందులోనుంచి దొడ్లోకి వచ్చి లోపలికి రండి. దొడ్డి తలుపు తీసేవుంది."

సందులో అడుగుల శబ్దం. చూపును దొడ్డి వాకిలి పై కేంద్రీకరించాడు నిరంజనం.

దొడ్డి గుమ్మంలో ఓ స్త్రీ! ఎవరామె? సినిమాల్లో లాగా మసక మసగ్గా కని పిస్తుందేమిటి? ఈమె....ఈమె ఎక్కడో చూసిన జ్ఞాపకం! తనవెందుకలా ఎగాదిగా చూస్తోంది. తనను చూసి భయపడటం లేదేం? అసహ్యించుకోవటం లేదేం? పైగా ఆమె కన్నుల్లో అశ్రువులా!

భార్య తనను ఒంటరిగా వదిలి పోయిన ఈ నెలరోజుల్లోనూ తనను చూడటానికి వచ్చిన మొదటి వ్యక్తి ఈమె. ఈమెకు తెలీదా తనను సమాజం వెలివేసిందని?

"నిరంజనం!"

అవును, అది తన పేరే! ఈమె వచ్చింది తన కోసమే. కాని ఎవరామె?

"నేను నిరంజనం, కాళిందిని."

కా .. ళిం ..ది. కాళింది. ఈమె కాళిందేనా? ఎంత మార్పు ఆరు సంవత్స రాలలో ఎంత మార్పు! ఇక కన్పించ దనుకున్న కాళింది హఠాత్తుగా, సినిమాల్లోలాగా-ఇలా సాక్షాత్కరించటం ఎంత ఆశ్చర్యం!

"నువ్వా!" పడుకున్న నిరంజనం లేవాలని ప్రయత్నం చేశాడు. బాధతో మళ్ళీ పడుకున్నాడు.

కాళింది అతనికి దగ్గరగా వచ్చి కూర్చుంది. ఎడమచేత్తో అతని తలను ప్రేమగా, వాత్సల్యంతో నిమిరింది.

ఛీ. ఛీ. నన్ను తాకుతుందేమిటి?

"నన్ను ముట్టుకోకు కాళిందీ! చూస్తు న్నావ్‌గా నా వ్యాధి...అంటువ్యాధి.... భయంకరమైన అంటువ్యాధి." అతని కళ్ళవెంట అశ్రువులు. అలా అన్నాడే కాని, ఆమె తనచేతిని వెనక్కు తీసుకో కూడదనే కోరుకున్నాడు. ఆమె చేతిస్పర్శ ఎంత ఆత్మీయతను, ఎంత హాయిని అందించింది!

కాళింది చిరునవ్వుతో అతన్ని చూసింది. కర్చీఫ్‌తో అతని కన్నీటిని తుడిచింది.

దూరమైపోయిన తప్పెటం మోతలు బొట్లు మోతలు తిరిగి దగ్గరౌతున్నాయి! అంటే....అది అంతిమయాత్ర తాలూకు హంగామా కాదా? మరేమిటి? నిరంజనం కాళిందిని అడిగేడు.

"అదా! అదీ. ఊరేగింపు... కొత్త సినిమా ఊరేగింపు, ఊరి చివరిదాకా వెళ్ళి తిరిగి ఊళ్ళోకి వెళ్తోంది."

సినిమా....సినిమా....

"ఏం సినిమా? యూ సర్టిఫికేటా, ఏ సర్టిఫికేటా?"

"ఏ సర్టిఫికేటే."

ఏ, కేపిటల్ ఏ. ఆ అక్షరానికి ఒక వేపు హీరో, మరోవేపు హీరోయిన్. హీరో చేతిలో హీరోయిన్ పమిటచెంగు. అతన్ని వారిస్తున్నట్లుగా పమిటచెంగును వెనక్కి లాగుకుంటున్నా, అతను చేస్తున్న పనికి ఆమె మొహంలో ఆనందం, పెదవులపై చిరునవ్వు. ఓహ్!...

నిరంజనం కాళింది మొహంలోకి చూశాడు. ఆమె కళ్ళలో దోబూచులాడు తున్న స్మృతుల తెరలను చూశాడు. తన చూపులను తప్పించుకుంటూ తల వంచుకున్న కాళింది రూపం క్రమ క్రమంగా మసకబారిపోయింది. సినిమా రీలులా గతమంతా కళ్ళముందు కదిలాడింది.

'అన్నయ్యా! నాకు ఇంగ్లీషు పిక్చర్ చూపెట్టవా?"

"ఇంగ్లీషు పిక్చరా? మతేమైనా పోయిందా నీకు. ఇంగ్లీషు పిక్చరును నీవు అర్థంచేసుకోగలవా?" నిరంజనం విసుక్కున్నాడు.

"అదేమిట్రా! స్కూల్ ఫైనల్ చదివినదానికి ఇంగ్లీషు సినిమా అర్థం కాదంటావా?" అని అడిగింది శాంతమ్మ.

నిరంజనం నవ్వేడు తల్లి అమాయ కతకు "బి.ఏ. చదివినవాళ్ళకే సరిగా అర్థంకాదు. ఇక దీనికేం అర్థమౌతుం దమ్మా?"

"ఏదో, అయినంతవరకూ అవుతుంది లేరా పాపం, తల్లీ తండ్రీ లేని పిల్ల. దాని మనసు నొప్పించకు. ఇవాళ మొదటి ఆటకు తీసుకువెళ్ళు," అంది శాంతమ్మ.

శాంతమ్మ అక్కకూతురే కాళింది. చిన్నవయసులోనే ఒక బస్సు యాక్సి డెంట్‌లో తల్లీ, తండ్రీ ఇద్దరూ చని పోగా ఏకాకిగా మిగిలిన కాళిందిని శాంతమ్మ దగ్గరకుతీసి కన్నకూతురిగా సాకి యస్.యస్.ఎల్.సి వరకు చదువు చెప్పించింది

నిరంజనం, కాళింది సినిమానుంచి ఇంటికి వచ్చేసరికి శాంతమ్మ ఎక్కడికో బయలుదేరింది. "మీ రిద్దరూ అన్నం పెట్టుక తినండి. గుళ్ళో హరికథ చెపుతున్నారుట, కాసేపు విని వస్తాను," అంది.

అన్నం తిని, చెరొక పుస్తకం పట్టుకుని చదువుతూ కూర్చున్నారు నిరంజనం, కాళింది. ఎప్పుడు నిద్ర పట్టిందో!

ఆ నిద్రలో ఏవేవో కలలు; రంగు రంగుల కలలు .ఏదో సినిమా హీరో హీరోయిన్లు ఒకరిచేతితో మరొకరు చేయి కలిపి జంటగా నీలిమేఘాలలోకి ఎగురుతూ, పాడుతూ మంచుకొండలపై జారుతూ, పచ్చికబయళ్ళలో దొర్లుతూ

హీరో చేతులు హీరోయిన్ నడుమును చుట్టివేశాయి. హీరోయిన్ అతని స్పర్శకు పరవశమౌతూ, అతని మెడచుట్టూ తన చేతులను పెనవేసి అతని పెదాలకు తన అధరాలను చేరువచేసింది అతను ఆమె మీదికి వొరిగాడు.

కాళింది కళ్ళు తెరిచింది గది అంతా చీకటి. ఏమీ కనిపించటంలేదు. ఏమైందీ తెలియటంలేదు. శరీరమంతా మత్తుగా, బరువుగా, విరగ్గొట్టినట్లుగా వుంది. శరీరంలోని ప్రతి అణువూ ఏదో కొత్త అనుభవాన్ని పొందినట్లుగా – అందు కను గుణంగా ప్రతిస్పందిస్తున్నట్లుగా వుంది. ఏం జరిగింది ?

లేచి వెళ్ళి లైటువేసింది కాళింది. గదిని ముంచెత్తిన వెలుగులో తనను చూసుకుంది. ప్రక్కనున్న నిరంజనంను చూసింది. తన బట్టలు అస్తవ్యస్తంగా నిరంజనం అర్ధనగ్నంగా....

వెలుగు మీదపడగానే ముంజేతిని కళ్ళకడ్డం పెట్టుకున్నాడు నిరంజనం. వెంటనే లేచి ఊడిన లుంగీని చుట్టబెట్టు కున్నాడు.

అతన్ని పరిశీలనగా చూసింది కాళింది. అతని పెదాలపై చిరునవ్వు అతని కళ్ళలో గెలుపువెలుగు.

కాళింది అసహ్యంగా చూసిందతన్ని. అంతలోనే తలదించుకుంది. తన పాత్ర కూడా ఉన్నది జరిగిన ఘాతుకంలో. తనకు గుర్తువస్తోందిప్పుడు. పుస్తకం చదువుతూ పడుకున్న తనకు వెంటనే నిద్రపట్టేసింది ఆ నిద్రలో కల. ఆ కలలో ఆపూట చూసిన సినిమాలోని కొన్ని శృంగార సన్నివేశాలు చోటుచేసు కున్నాయి. అందులోని నాయిక తానే అయినట్లు అనుభూతి. నాయకుడు తనను హృదయానికి హత్తుకున్నట్లు భావన. అతని స్పర్శలో తను వేడితగిలిన మంచు ముక్కలా కరిగిపోతున్నట్లు ఏదో తెలియని వింత సుఖానుభూతికి చేరువౌ తున్నట్లు – ఇప్పుడు తెలిసివస్తోంది బాహ్యంగా నిరంజనంచేతుల్లో తన శరీరం నలుగుతున్నప్పుడు మానసికంగా కలను అనుభవిస్తోంది తాను

సినిమా యువతపై ఎంతటి ప్రభా వాన్ని చూపుతోంది!

కాళింది మూడు రోజులవరకూ నిరంజనంను తప్పుకతిరిగింది. ఒంటరిగా గడిపినట్లు ఆమెకళ్ళే సాక్ష్యమిస్తు న్నాయి మూడోరోజు. .

"నిరంజనం!" పిలిచింది కాళింది.

ఆమె తనను పేరుపెట్టి పిలవటం గమనించాడు నిరంజనం.

"ఎంత తప్పు జరిగిపోయింది! పవిత్ర మైన సోదరీ సోదర బాంధవ్యాన్ని పాప పంకిలం చేశాము. పశుప్రవృత్తికి దాసుల మైనాము గర్హ్యనీయమైన నేరంచేసిన మనం జీవితంలో ఏ ఘోరశిక్షను అనుభవించాలో ఈ నేరానికి మనలను పురికొల్పిన సినిమాలను నేను చూడను

గాక చూడను. నాకో ఉపకారం చేసిపెట్టు. నన్ను నర్సుకోర్సులో చేర్పించు. నా బ్రతుకు నేను బ్రతుకుతాను. ఇక్కడ వుండి, ఏమీ ఎరుగనిదానిలా అమ్మ ముందు నటిస్తూ నేను ఆత్మవంచన చేసుకోలేను. ఒలాగని పవిత్ర బాంధవ్యాన్ని కలుషితంచేసిన దోషిగా సమాజానికి పరిచితం కాలేను." కాళింది రెండుచేతులతో ముఖాన్ని కప్పుకుంది.

నిరంజనం నవ్వుకున్నాడు. వ్యక్తుల మధ్య వావివరుసలు కల్పితాలేనని, స్త్రీ పురుషుల కలయిక స్వాభావ్యమేనని, నేరంకాదని, పాపపుణ్యాల భావన సెంటిమెంట్ మాత్రమేనని ఆమెకు నచ్చచెప్ప చూశాడు కాని, అతని మాటలు ఆమె వీనులకు రుచించలేదు. ఆమె తన నిర్ణయాన్ని మార్చుకోలేదు. ఫలితంగా తల్లి అంగీకారం తీసుకుని కాళిందిని మద్రాసులో నర్సింగ్ కోర్సులో ప్రవేశపెట్టి వచ్చాడు నిరంజనం.

తప్పుకు తగిన శిక్ష లేనప్పుడు మానవుడు బరితెగించటం సహజం. కాళింది ఏ ఘోరం తలపెడుతుందోనని నిరంజనం భయపడ్డాడు మొదట్లో. కాని ఆమె అతిసామాన్యంగా, ఆ ఇంటినుండి వెళ్ళి చదువులో లీనమవటం అతని భావనాసరళికి బలం చేకూర్చి అతని జీవనగమనాన్నే మార్చివేసింది, జీవితమంటే అందుబాటులోకి వచ్చిన సుఖాలను విచక్షణారహితంగా అనుభవించటమే ననే దురభిప్రాయం కలిగిందతనిలో. కామాన్ని తీర్చుకొనే సాధనంగానే స్త్రీని చూడటం నేర్చుకున్నాడతను. ఆ భావనలో, ఆ ఒరవడిలో తెగిన గాలిపటంలా గాలివాటుగా తిరిగాడతను. తిరిగి, తిరిగి తనకొక నిలకడ కావాలని గ్రహించి, తల్లిమాటకు చెవి వొగ్గి తాయారు మెడలో తాళి కట్టేడు.

తాయారు మధ్య తరగతి స్త్రీ. కాస్తో కూస్తో చదువుకున్నది. మారుతున్న లోకం పోకడను అర్థంచేసుకోగలిగిన విజ్ఞత వుంది ఆమెలో. గతాన్ని విస్మరించి వర్తమానాన్ని బంగరుబాటగా తీర్చిదిద్దుకోవాలనే తత్వం ఆమెది. అందుకని నిరంజనం గతం తెలుసుకున్నదైనా, గోపికాలీలలు విన్నదైనా, తన సాహచర్యంలో అతను మారి, బాధ్యతాయుతమైన భర్తగా ప్రవర్తిస్తాడనే ఆశతోనూ, తన నేర్పుతో, చాకచక్యంతో భర్త అభిమానాన్ని చూరగొని అతని గత జీవితపు ఛాయలనుండి అతన్ని మరల్చగలననే ఆత్మవిశ్వాసంతోనూ పెళ్ళికి ఒప్పుకుంది.

కొడుకు ఒక యింటివాడయినందుకు మహదానందపడింది శాంతమ్మ. ఇల్లు పట్టక తిరిగే నిరంజనం ఇక కుదురుగా వుండటం దుర్లభమని నిరాశలో మునిగిన ఆమెకు ధైర్యాన్ని చెప్తూ ఆమెకు అన్ని విధాలా అండదండగావుండి, సమయంచూసి నిరంజనంను పెళ్ళికి ఒప్పించినవాడు పార్వతీశం.

పార్వతీశం స్థానికమైన ఓ పెద్ద ఎరువుల కంపెనీలో ఉద్యోగి. అతను నిరంజనం ఈడువాడే. నిరంజనం ఉంటున్న ఇంటి ప్రక్క భవంతిలోనే అతను వుంటున్నాడు.

నిరంజనంకు, తాయారుకు పెళ్ళి జరపటంతోనే. తన పని అయినట్లుగా తొలగి కూర్చోలేదు పార్వతీశం ఎరువుల కంపెనీ మేనేజరు కాళ్లావేళ్లాపడి నిరంజనంకు చిన్నపాటి ఉద్యోగం కూడా వేయించాడు. పాపం శాంతమ్మ మాత్రం తన బాధ్యత తీరినట్లు ఈ లోకం నుండి వెళ్ళిపోయింది.

సాఫీగా దొర్లే జీవితచక్రాలను వూహించని మలుపులు త్రిప్పి ఆ మలుపుల్లో ఆ జీవితాలు క్రిందామీదా అవుతుంటే చూస్తూ వినోదించటం కాలం స్వభావమేమో!

ఒకరోజు తాయారు సినిమాకు వెళ్దామంది భర్తతో. కాని నిరంజనంకు ఆ రోజు రాత్రి ఎదిమిదింటిదాకా కంపెనీలో వుండిపోవలసి వుంది. ఆ రోజుతో ఆ సినిమా వెళ్ళిపోతుంది. మంచి సినిమా. తాను చూశాడుకాని భార్య చూడలేదు. రెండో ఆటకు వెళ్ళి నిద్రకాయటం అలవాటు తక్కువ. "పక్కింటి భానుమతితో వెళ్ళరాదూ," అన్నాడు.

భానుమతి పార్వతీశం భార్య.

"అన్నగారు వూళ్ళో లేరుట. ఆవిడ వస్తుందో రాదో," అంది తాయారు.

"ఆయన వూళ్ళో లేకపోతే తప్పకుండా వస్తుంది మీ రిద్దరూ వెళ్ళరండి," అవి చెప్పి కంపెనీకి వెళ్ళిపోయాడు నిరంజనం.

నిరంజనం ఇంటికి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. స్నానంచేసి పడుకున్నాడు. సినిమాకు వెళ్ళిన తాయారు, భానుమతి ఇంకా రాలేదేమిటా అవి ఆలోచిస్తున్నాడు

సినిమా అనగానే అతనికి కాళింది గుర్తుకువచ్చింది. ఐదేళ్ళు గడిచింది ఆమె ఈ వూరు నుండి వెళ్ళిపోయి. వెళ్ళిన సంవత్సరంవరకు అప్పుడప్పుడూ ఉత్తరాలు వచ్చేవి. ఆ తర్వాత ఆమె దగ్గర్నుంచి ఉత్తరమే లేదు. తాను రాసిన ఉత్తరాలు ఆమెకు చేరకుండానే తిరిగి వచ్చేవి. ఆమె ఇప్పుడెక్కడుందో! ఎలా వుందో!!

తలుపు చప్పుడుకు ఆలోచనల్లోనుండి తేరుకున్నాడు నిరంజనం. లేచి వెళ్ళి తలుపు తీశాడు. తాయారు లోనికొచ్చింది. భానుమతి వాళ్ళయింటివేపు నడవటం చూశాడు.

భోజనాలు ముగించుకొని పెరటివేపు ఆరుబయట పడుకున్నారు భార్యాభర్తలిద్దరూ.

"సినిమా ఎలా వుంది?" అడిగేడు నిరంజనం

"చాలా బావుందండీ! అయితే నాకొక్కటే నచ్చలేదు. ఏ సర్టిఫికేట్

సినిమా అయినా, సగానికి సగం మంది పదహారేళ్ళలోపువాళ్ళే చూస్తున్నారు .."

విరంజనంకు తన బాల్యం గుర్తుకు వచ్చింది. బడికి ఎగ్గొట్టి, మేట్నీలకు తిరిగేవాడు స్నేహితుల్తో. ఎక్కువగా ఇంగ్లీషు హిందీ సినిమాలే చూసేవాడు. వాటిలోని రంగులు, డాన్సులు, ఖరీదైన దుస్తులు తొడిగి, చెట్టాపట్టాలేసుకుని హీరోహీరోయిన్లు పార్కులలోనూ, చేలగట్లపైనా, మంచుకొండలపైనా పచ్చికమైదానాలలోనూ తిరగటం ఎంతో నచ్చేది. స్కూలులో ఎదురైన ప్రతి విద్యార్థినిని చూసినప్పుడు ఆమెతో అలా తిరగాలనే కోరిక కలిగేది తనలో. నిజ జీవితంలో కూడా ప్రేమికులు సినిమాల్లో లాగా పాటలు పాడుకుంటూ, దివ్య లోకాల్లో తేలిపోతున్నట్లుగా గడపటం ఎందుకు సాధ్యంకాదో అప్పుడతనికి అర్థమయ్యేది కాదు.

"నిద్రపోతున్నారా?" అడిగింది తాయారు.

విరంజనం కళ్ళు విప్పి భార్యవైపు చూశాడు. వెన్నెల్లో తాయారు మొహం ప్రసన్నంగా వుంది. కళ్ళు మిలమిలా మెరుస్తున్నాయి. వత్తిగిలి పడుకున్న ఆమె తలలోని విరజాజులు వెన్నెలకే వెలుగు నిస్తున్నాయా అన్నంత తెల్లగా ఉన్నాయి.

"ఏదో చికాగ్గా వున్నదండీ! నిద్ర రావటం లేదు," అన్నది తాయారు మత్తుగా.

ఆమె మాటల్లోని సంకేతాన్ని గ్రహించాడు విరంజనం అతన్లో కోర్కె చెలరేగింది. కుడిచేతిని తాయారుపై వేసి ఆమెను దగ్గరకు లాక్కున్నాడు. ఆమె మరింత చేరువైంది. అతని కౌగిలిలో గువ్వలా వొదిగిపోయింది. ఆమె శిగలోని విరిసిన విరజాజులను తనివితీరా ఆఘ్రాణించాడు విరంజనం.

అప్పుడు గోడదగ్గర ఏదో చప్పుడైంది. తల ఎత్తి చూశారు విరంజనం, తాయారు. ఏమీ కన్పించలేదు. ఏదో లెమ్మనుకున్నారు.

తాయారు వెంటనే నిద్రపోయింది కాని, విరంజనంకు నిద్రపట్టలేదు. అతని దృష్టి అంతా గోడపైపే వుంది. మనిషి అలికిడి అయినట్లుగా అనుమానం. ఆ గోడ తమ ఇంటికి పార్వతీశంగారింటికి సరిహద్దు. తమలాగే పార్వతీశంగారు కూడా భార్యతోపాటు ఆరుబయట పడుకుంటారు ఎండాకాలమంతా. కాని యీ రోజు పార్వతీశంగారు వూళ్ళో లేరు. మరి ఆవిడ ఒక్కతే దొడ్లో పడుకుందా, లేక లోపల పడుకుందా? పరిపరివిధాల పోతున్న మనసును పగ్గంవేసి లాగినట్లుగా అదుపులోకి తెచ్చుకుంటూ కళ్ళు మూసుకున్నాడు విరంజనం.

మర్నాడు ప్రొద్దున కంపెనీకి బయలు దేరుతుంటే ప్రక్కయింటి గుమ్మందగ్గర భానుమతి నిల్చుని కనిపించింది విరంజనంకు. తనను చూసి నవ్వుతోంది

బలవంతాన నవ్వును అపుకొన్నట్లుగా అనిపించిందతనికి. అతను తలవంచు కుని చకచకా నడిచివెళ్ళాడు

మధ్యాహ్నం యింటికి తిరిగి వచ్చే టప్పుడు నిరంజనం పార్వతీశం ఇంట్లోకి యాదాలాపంగా చూశాడు. భానుమతి వరండాలో పడకుర్చీలో పడుకుని వీధి వాకిలివైపు చూస్తోంది. తనను చూసి పలకరింపుగా నవ్విందామె. తాంబూలం సేవించగా ఏర్పడిన అరుణిమ ఆమె తెల్లని పలువరుసను, పలుచని పెదాలను ఆక్రమించింది.

నిరంజనం భోజనంచేస్తున్నంతసేపూ పరధ్యానంగానే ఉన్నాడు. భోజనం అయిన తర్వాత అరగంట విశ్రాంతి తీసుకుని తిరిగి కంపెనీకి వెళ్ళటం అతని అలవాటు కాని ఆరోజు భోజనం అయిన వెంటనే కంపెనీకి బయలు దేరాడు వెళుతూ వెళుతూ ఈసారి పార్వతీశం ఇంటివైపు చూడలేదు. కాని వరండాలో నుంచి వచ్చిన గాజుల గల గల ధ్వని అతని చెవుల్లో దూరక మానలేదు.

ఆ పూటంతా అతను అన్యమనస్కంగానే ఉన్నాడు. పదే పదే ఉదయామూ, మధ్యాహ్నమూ కనిపించిన భానుమతి మొహమూ, ఆమె నవ్వూ అతని మనసును తొలిచేస్తున్నాయి. ఆ నవ్వు కేవలం స్నేహపురస్సరంగామూ, మర్యాద సూచకంగానూ, పలుకరింపుగానూ అన్పించలేదతనికి. కవ్వింపు చర్యగానూ మనసులోని ఏదో భావాన్ని అభివ్యక్తం చేసేదిగానూ అనిపించింది. అంతలోనే, తను తప్పుగా భావిస్తున్నానేమో అను కున్నాడు కాని అతని జీవితపు అనుభవం 'నీవు పొరబడటంలేదు' అని ప్రవచిస్తోంది.

ఆ సందిగ్ధతలో, ఆ గుంజాటనలో కాలం అతనికి తెలీకుండానే గడిచి పోయింది. ఆరోజు పూర్తికావలసిన పనిమాత్రం పూర్తిచేయలేకపోయాడు. ఫలితంగా అతను రాత్రి తొమ్మిదింటి వరకు కంపెనీలోనే ఉండిపోవలసి వచ్చింది.

ఇంటికి తిరిగివస్తున్న నిరంజనం ఒక నిర్ణయానికి వచ్చాడు. ఏదో మొండి ధైర్యం అతన్ని ఆ వ రిం చిం ది. పార్వతీశం ఇంటివరకు మెల్లగా నడిచి, క్షణంసేపు పరిసరాలను జాగ్రత్తగా పరికించి, ఎవరూ చూడటంలేదని రూఢి చేసుకుని గభాలున పార్వతీశంగారింట్లోకి జొరపడ్డాడు.

భానుమతి కుర్చీలో కూర్చుని ఏదో నవల చదువుతోంది. నిరంజనంను చూసి లేవలేదు. అలాగే కూర్చుని నవ్వింది.

అదే నవ్వు ఆమె మొహంలో. అదే భావం ఆమె కనులలో.

నిరంజనం నిల్చునే "పార్వతీశం గారు రాలేదా" అని అడిగేడు.

ఆమె జవాబు చెప్పలేదు. అతని

మొహంలోకి ఒకసారి చూసి తిరిగి తల దించుకుని చేతిలోని పుస్తకం పేజీలను బొటనవ్రేలితో ఇటునుంచి అటు, అటు నుంచి యిటు త్రిప్పుతోంది. నిరంజనం తన ప్రశ్నను రెట్టించాడు.

"ఆయన ఎప్పుడు వచ్చేది నీకు తెలీదా?" నీ వొచ్చిన దారి నీకే తెలీదా అని వరూధిని ప్రవరుణ్ణి ప్రశ్నించినట్లు తోచింది నిరంజనంకు.

"కొంచెం మంచినీళ్ళిస్తారా" నిరంజనం అడిగేడు.

ఆమె మళ్ళీ చిరునవ్వు నవ్వి కుర్చీలో నుంచి లేచి లోనికి వెళ్ళింది.

నిరంజనం ఆమె ఖాళీచేసిన కుర్చీలో కూర్చున్నాడు. 'మీ యిల్లు ప్రక్కనే గదా! ఇక్కడ మంచినీళ్ళు అడుగుతా వేం' అని ఆమె అడిగితే తను ఏం సమాధానం చెప్పేవాడు?

మంచినీళ్ళు అందుకుంటూ ఆమెచేతి వ్రేళ్ళను స్పృశించాడు. ఆమె అలాగే నిల్చుంది కుర్చీకి దగ్గరగా మంచినీళ్ళ గ్లాసును ప్రక్కనపెట్టి ఆమెచేతిని తన చేతిలోకి తీసుకుని ఆమెను తనమీదకు లాక్కున్నాడు. 'లైటు' అని మాత్రం అన్నదామె.

ఇంటికొచ్చిన నిరంజనం స్నాన పానాదులు ముగించుకుని పడుకున్నాడు. ఇల్లు సర్దుకొని వచ్చిన తాయారు అలసటగా ప్రక్కమీద వాలింది. కొంచెం సేపు కబుర్లైనా చెప్పకుండా అవురించి కళ్ళుమూసుకుని నిద్రకుపక్రమించింది.

నిరంజనం ఆమెవైపు చూశాడు. ఆమె మొహం నిన్నటిలా లేదు. శిగలో విరజాజులు లేవు వెన్నెల కూడా మందకొడిగా పొగచూరిన దీపంలా మసగ్గా వుంది. ఏమిటి ఈ తేడా అను కున్నాడు నిరంజనం. ఆలోచిస్తున్న అతనికి హఠాత్తుగా ఏదో స్ఫురణకు వచ్చింది. 'ఏ సర్టిఫికెట్ సినిమా అయినా సగానికి పైగా పదహారేళ్ళ లోపువాళ్ళే చూస్తున్నా'రన్న తాయారు మాటలు, ఆ తర్వాత ఆమె చేష్టలలోని వివశత అతనికి జ్ఞప్తికి వచ్చాయి. నిన్న తాయారు చూసిన సినిమా ఆమెలో కామోద్దీపనకు కారణమైందా? మరి ఆమెతోపాటు వెళ్లిన భానుమతి కూడా అలాంటి ప్రలోభానికే లోనైందా? ఆ ప్రలోభమూ, భర్త వూరిలో లేకపోవటమూ ఆమె చేష్టలలోని వికారానికి కారణమైనవా? నిన్నరాత్రి గోడదగ్గర శబ్దం ఆమె రాక వల్లనేనా? అయితే, ఎందుకు వచ్చింది? ఇలా ఎన్నో ప్రశ్నలు అతని మనసును నిద్రనుండి దూరంచేసినై.

నిరంజనం మాగన్నుగా నిద్రపట్టే సమయానికి ఎక్కడో ఏదో, బరువుగా ఎత్తునుండి పడ్డట్లు వినిపించింది. కాని అలసిన మనసు, శరీరం అశబ్దం తాలూకు వివరాలను సేకరించ నిరాకరించాయి. వీధిలో కుక్క ఒక్కటి శోకం పెడుతూ

నడిచేస్తోంది. తెల్లవారి తాయారు నిద్ర లేపేవరకు అతనికి మెళకువ రాలేదు.

కళ్లు తెరిచిన అతనికి ఎదురుగా ఏడుస్తున్న తాయారు కనిపించింది. గోడ కవతల ఎవరో కలగాపులగంగా మాట్లాడుతున్న ధ్వని వినిపించింది. "ఏం జరిగింది?" అదుర్దాగా ప్రశ్నించాడు నిరంజనం.

"భానుమతి బావిలో పడిందండి" అన్నది తాయారు.

స్థాణువై పోయాడు నిరంజనం. వడివడిగా అడుగులు వేసుకుంటూ పార్వతీశంగారింటికి వెళ్లాడు.

"ఘోరం జరిగిపోయిందండి" అన్నారు అక్కడున్న ఇరుగుపొరుగులు.

"పార్వతీశం కేంపుకు వెళ్లాడటగా ఇప్పుడే టెలిగ్రాం ఇచ్చి వచ్చాం" అన్నాడొకాయన.

"పాపం, చాలా మంచివాడు. ఒకరికి ఉపకారం చేయటమే కాని ఎన్నడూ ఇతర్లకు హానితలపెట్టని సహృదయుడు. ఆయనకు ఇలా భార్యవియోగం కలగటం శోచనీయం."

"ఎప్పుడో ఒకప్పుడు అందరూ చావ వలసిందే. కాని ఇలా అర్థాంతరంగా ప్రమాదభరితమైన చావు చావటం బ్రతికిన వాళ్ళకు ఎంతో బాధాకరం.

"ప్రమాదభరితం కాదుట, ఆత్మ హత్యట."

"అలాగని కాగితం కూడా రాసి పెట్టిందట."

"రేప్ కేస్‌టగా"

"ఎవరో ఈ కిరాతకానికి ఒడిగట్టింది; వాడు పురుగులు పడి ఛస్తాడు." అంటోంది ఒక యిల్లాలు చేతులు త్రిప్పుతూ.

"ఏమీ చావడు. లక్షణంగా తిరుగు తాడు. పిల్లి శాపానికి ఉట్టి తెగుతుందా అన్నట్లు, ఈ రోజుల్లో న్యాయం ఎక్కడుంది. అన్యాయమే అందంగా ఊరేగుతోంది" అన్నది ఇంకొకావిడ.

"ఏమీకాదు. అదంతా మన భ్రమ. కోర్టులున్నా లేకపోయినా, న్యాయం నడుస్తూనే ఉంటుంది. నేరంచేసే ప్రతివాడూ చచ్చేలోపల తను చేసిన నేరానికి భగవంతుడు వేసే శిక్షను అనుభవించే తీర్తాడు. ఇది పిల్లిశాపం కాదు ఒక స్త్రీ జీవితాన్ని పతనంచేసినందుకు స్త్రీ జాతి యావత్తూ అవమానంగా భావించి కల్లోలిత హృదయాలతో ఏక కంఠంగా ఇచ్చే అభిశాపమిది." మరో స్త్రీ ఉద్రేకంగా మాట్లాడింది.

నిరంజనం నిల్చోలేకపోయాడు. కడుపులో దేవినట్లయిందతనికి. ఇంటికి తిరిగి వచ్చేశాడు.

పోలీసులు రావటం, కేసు నమోదు చేసుకోవటం, స్టేట్‌మెంట్లు తీసుకోవటం, శవాన్ని పోస్ట్‌మార్టంకు పంపటం అన్నీ జరిగిపోయాయి.

"అన్నయ్యగారు వచ్చినట్లున్నారు, ఒకసారి వెళ్లి కనిపించిరాకూడదూ" అంది తాయారు.

"నేను వెళ్ళలేను తాయారూ। నేనాతని దుఃఖాన్ని చూచి తట్టుకోలేను" అన్నాడు నిరంజనం.

"అలా అంటే ఎలా? ప్రక్క ప్రక్క వాళ్ళం. పైగా మనకెంతో సాయంచేసిన వారు. బదులుగా మన మేమీ సాయం చేయకపోగా దుఃఖ సమయంలో ఆయనకు సానుభూతి అయినా చూపటం మన మంగ మైనందుకు మన కనీస కర్తవ్యం."

నిరంజనం తాయారును చూశాడు. ఆమె మొహం జేవురించివుంది. ప్రొద్దుటి నుంచి స్నేహితురాలి మృతికి ఏడ్చిం దన్న గుర్తుగా కళ్లు ఉమ్మెత్తకాయల్లా ఉబ్బివున్నాయి. వెంటనే చూపు మరల్చు కుని పార్వతీశం ఇంటివైపు నడిచాడు.

నిరంజనంను చూడగానే పార్వతీశం పసివానిలా బావురు మన్నాడు. నిరంజనంను కావలించుకుని అతని ఎదపై తలవుంచి ఎంతోసేపు ఏడుస్తూనే ఉన్నాడు. ఆత్మీయులు కనిపించినపుడు హృదయశోకం కట్టలు తెంచుకుంటుం దంటారు ఇదే కాబోలు!

నిరంజనం శిలా ప్రతిమలా నిల్చున్నాడు. అతని కళ్ళనుండి ఒక్క కన్నీటిబొట్టు రాలలేదు. అతని గుండె మాత్రం వేగంగా స్పందించసాగింది.

భానుమతి ఆత్మహత్యకు ఎందుకు పాల్పడిందో అతనికి అంతుబట్టలేదు నవ్వుల కవ్వింపుతో, కళ్ళలోని ఆహ్వానంతో తనకోర్కెను వ్యక్తంచేసిన స్త్రీ - కోరిక తీరిన వెంటనే ఆత్మహత్య తలపెట్టడమేమిటి? పరిస్థితుల ప్రాబల్యంతో క్షణికమైన ఉద్రేకానికి లొంగిపోయి ఆ వేడి చల్లారిన పిమ్మట తన తొందరపాటుకు పశ్చాత్తాపపడి, కళంకిగా భర్తకు మొహం చూపటం ఇష్టంలేక ఈ నిర్ణయం తీసుకుందా? సినిమాల్లో లాగా నిజజీవితంలో కూడా ఇలాంటి వ్యక్తులు తారసపడుతుంటారా?

ఆ రోజంతా అన్నం ముట్టలేదు నిరంజనం. తీవ్రమైన జ్వరం వచ్చినట్టు అస్తిమితంగా ఉండిపోయాడు.

మర్నాటికి నిజంగానే జ్వరం వచ్చింది. తాయారు డాక్టరును పిల్చు కొచ్చింది డాక్టరు ఇంజక్షనుచేసి మందులు రాసిచ్చి అవి వాడే విధానం చెప్పి వెళ్ళిపోయాడు.

వారం రోజులకు జ్వరం తగ్గింది. కాని శరీరంలోని ప్రతి నరమూ లాగు తున్నట్లు బాధ శరీరంపై అక్క డక్కడా ఎర్రని మచ్చలు. పీతభూముల్లా ఉబ్బెత్తుగా వుండే మచ్చలు. కొన్నాళ్ళకు ఆ మచ్చలు వాపు తగ్గి సర్మజ్ఞానాన్ని కోల్పోవటం, మరో ప్రదేశంలో మచ్చలు....

రోజులు, వారాలు, నెలలు కాల గర్భంలోనికి దొర్లిపోతున్నాయి.

నిరంజనం ఆరోగ్యం నానాటికీ క్షీణించ సాగింది. తాయారుకు భయం కలిగింది. ఇరుగు పొరుగుల సహాతో భర్తను హాస్పిటల్లో చేర్పింది.

పదిరోజులు అన్ని పరీక్షలూ జరిపిన మీదట నిరంజనంకు కుష్ఠువ్యాధి అని నిర్ణయించారు డాక్టర్లు. తాయారు దిగ్రుశ్ళింది. గుండెలు అవిసేలా ఏడ్చింది సాఫీగా సాగే తమ సంసారంలో మహమ్మారిలాంటి ఈ వ్యాధి చిచ్చును రగిల్చింది. ఈ చిచ్చు చల్లారే దెలా? భర్త వ్యాధి నయమయ్యే దెప్పుడు?

ఆమెకేమీ పాలుపోలేదు. పెద్దపెద్ద పట్టణాల్లో ఈ వ్యాధికి ప్రత్యేకమైన హాస్పిటల్స్ ఉన్నాయట. అక్కడికి భర్తను తీసుకపోయి వైద్యం చేయించా లనుకుంది అందుకు కావలసిన డబ్బును సమకూర్చుకునే వరకు భర్తను ఇంట్లోనే వుంచాలనుకుంది. హాస్పిటల్ నుండి డిశ్చార్జి చేయించుకుని భర్తను ఇంటికి తీసుకవచ్చింది. రోజూ శ్రద్ధగా భర్త కురుపులను డెట్టాలుతో కడిగి మందు వేసేది. కంచంలో అన్నం కలుపుకుని వచ్చి నిరంజనం నోటికి ముద్దలందిస్తూ తినిపించేది.

అంత వ్యాధితో బాధపడుతున్నా నిరంజనం ఏమాత్రం అధైర్యపడకుండా నిబ్బరంగా ఉండటం ఆమెను కలచి వేసింది.

నిరంజనం తనకంటే భార్యను గురించి ఎక్కువగా ఆలోచించసాగేడు. ఆమె తనను అసహ్యించుకోకుండా పరిచర్యలు చేస్తూ చిన్నపిల్లవానిలా సంరక్షిస్తున్నందుకు మెచ్చుకున్నా, తన వల్ల, తన వ్యాధివల్ల ఆమె బాధలకు గురికావటం సహించలేకపోయాడు.

భానుమతి చనిపోయినప్పుడు ఇరుగు పొరుగులు అదిన మాటలు అతని మస్తిష్కంలో స్థిరనివాసమేర్పరచు కున్నాయి ఆమె కవ్వింపులకు తను చలించకుండా రెండ్రోజులు నిగ్రహించు కున్నట్లైతే ఆమె పతనమయ్యేదీ కాదు. ఆత్మహత్య చేసుకునేది కాదేమో నని పించింది

భానుమతిలాంటి ఎందరో స్త్రీలను నయానో, భయానో లొంగదీసుకుని అనుభవించిన తన నేరం తనవిప్పుడు ఈ వ్యాధిరూపంలో కట్టికుడుపుతోందా? తన పాపానికి నిష్కృతి ఎప్పుడో? చేసిన పాపం చెప్తే పోతుందంటారు. మనసులోని ఆవేదన మాటల రూపంలో బహిర్గతమైతే మనసుకు వూరటకలుగు తుందంటారు. మరి ఇప్పుడు తను తన పాపపు చెయిదాలను ఎవరితో చెప్పుకో గలడు? తన కిప్పుడెవరున్నారు? తల్లీ, తండ్రీ, తోబుట్టువు అందరూ భార్యలోనే కన్పిస్తున్నారు. అందుకని తాయారుకే చెప్పుకోవాలనుకున్నాడు.

ఒకరోజు తాయారు బాధగా "భగ వంతుడు మనకి శిక్ష ఎందుకు విధించా



దండీ!" రుణ, వ్యాధులు రెండూ మనిషికి పాపకర్మల ఫలితంగా సంభవిస్తాయిట అందుకని నాకీ వ్యాధి నా స్వయంకృతమేనేమో ననుకుంటున్నాను". అని, భానుమతి మరణానికి తానూ కారకుడేనని జరిగిందంతా చెప్పేడు.

అంతా విన్న తాయారు మ్రాన్పడిపోయింది. కలనైనా ఊహించని ఆ దారుణ సత్యం విని ఆమె తట్టుకోలేకపోయింది. ఒకప్పుడు—తన సాహచర్యంలో అతను బాధ్యతాయుతమైన భర్తగా ప్రవర్తిస్తాడనే ఆశ, తన నేర్పుతో, చాకచక్యంతో భర్త అభిమానాన్ని చూరగొని అతని గత జీవితపు ఛాయలనుండి అతన్ని మరల్చగలననే ఆత్మవిశ్వాసం తనకుండేవి కాని జరిగినదేమిటి? తన ఆశను, విశ్వాసాన్ని వమ్ముచేసి తనమీద చావుదెబ్బ కొట్టేడితను. ఆ భావం ఆమెలోని ఓర్పును, ప్రేమను, జాలిని తుడిచిపెట్టేసింది. ఇప్పుడు తను కట్టుబాటును అతిక్రమించిన అతనికి కట్టుబడి ఉండటం ఎందుకు? తన ఉనికిని విస్మరించిన అతనిని తను ఎందుకు స్మరిస్తూ కూర్చోవాలి?

అవే మాటల్ని అతనితో చెప్పి అతనినీ, ఆ యింటినీ విడిచి వెళ్ళింది తాయారు.

తాయారు వెళ్ళిపోయిన తర్వాత ఇంటి యజమాని ఇల్లు ఖాళీ చేయమన్నాడు. ఊళ్ళో మరెవ్వరూ ఇల్లు అద్దెకివ్వటానికి సిద్ధపడలేదు. అతని దయనీయమైన పరిస్థితిని గమనించిన కంపెనీ మిత్రులు కొందరు ఊరిబయట పాడుబడివున్న ఒక్క చిన్న యింటిలో అతనికి స్థావరమేర్పరచి వందుక

తినటానికి కొంత సామగ్రినిచ్చి చేతులు దులుపుకున్నారు.

అంటరానితనమూ, ఒంటరితనమూ తోడుకాగా నిరంజనం రోజొక యుగంగా గడుపుతున్నాడు. ఆ రోజు....తనను సాకి పెద్దచేసిన తల్లిని చూడాలనే తలంపుతో కాళింది ఆ వూరుకొచ్చింది. తల్లి చనిపోయిందని విని హతాశురాలై తిరిగిపోదామనుకుంటున్నప్పుడు నిరంజనం పరిస్థితిని విన్నది. ఆమెలోని 'నైటింగేల్' ఆమెను అతని దగ్గరకు నడిపింది.

* * *

మూడ్రోజులైన తర్వాత నిరంజనం కాళిందితో అన్నాడు "నీ విక వెళ్ళిపో కాళిందీ! భార్యకు కూడా దగ్గర ఉండకూడని భయంకర రోగిని నేను. నన్ను చూసినవారెవరైనా అసహ్యించుకుంటారు. భయపడతారు కూడా. ఒకప్పుడు నీవన్నావు గుర్తుందా, మన పతనానికి కారణభూతమైన ఏ సర్టిఫికెట్ సినిమాలను ఇక చూడనుగాక చూడనని? నే నిప్పుడు ఒక ఏ సర్టిఫికేట్ దృశ్యాన్ని; భయము, జుగుప్స కలుగుతాయి నన్ను చూస్తే. కనుక నన్ను చూస్తూ నీవిక యిక్కడ ఉండవద్దు. పాపఫలం అనుభవిస్తున్న నన్ను నా ఖర్మానికి వదిలేసెయ్!"

కాళింది నవ్వుతూ బదులు చెప్పింది: "నే నిప్పుడొక నర్సును. వ్యాధి ఎంత భయంకరమైనదైనా, రోగి ఎంత జుగుప్సాకరంగా వున్నా అతనికి సేవలు చేయటం నా ధర్మం. పైగా నీ ఈ స్థితికి నేనూ కారకురాలినే నిరంజనం! ఆనాడు నీవు కామోద్రేకంలో చేసిన నేరాన్ని నేను కప్పిపుచ్చటం వల్లనే నీవు స్త్రీలోలుడవై ఆరోగ్యాన్ని అలక్ష్యం చేశావు. దాని ఫలితమే నీకీ వ్యాధి. నా తప్పిదానికి శిక్షగా నీకు సేవలు చేయనీ. ఆ సేవలతో నా పాపాన్ని క్షాళితం చేసుకోనివ్వు. కాదనకు."

కాళింది సేవలు ఎన్నో రోజులు పొందలేదు నిరంజనం. తన సేవలు చేస్తూ కాళింది ఉద్యోగాన్ని వదలి కూర్చోవటం ఇష్టంలేని నిరంజనం నిద్రమాత్రలను మింగి తనువు చాలించాడు.

కాళిందికి మిగిలిందొక్కటే, అతని ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థించటం.